ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు



సోమవారం 9 జూన్ 2025

వరించిన మంత్రి పదవి..



ప్రమాణస్వీకారం చేస్తున్న వివేక్ వెంకటస్వామి

- ప్రమాణ స్వీకారం చేసిన వివేక్ వెంకటస్వామి
- పదవీ బాధ్యతలు స్వీకరించిన చెన్నూరు ఎమ్మెల్యే
- మూడో విడతలో పీఎస్సార్‌కు చాన్స్ ?

మంచిర్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెండో విడుత మంత్రివర్గ విస్తరణలో మంచిర్యాల జిల్లా చెన్నూర్‌నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డంవివేక్‌కు చోటు కల్పించింది. ఈ మేరకు గడ్డం వివేకానంద ఆదివారం రాజ్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ వివేక్ వెంకటస్వామితో ప్రమాణం చేయించారు. రెండో విడుతలో మొత్తం ముగ్గురు కొత్తగా మంత్రివర్గంలో చేరగా మాలసామాజిక వర్గంలో వివేక్ వెంకటస్వామిని పదవి వరించింది. దీంతో ఇంతకాలం జిల్లాకు మంత్రి పదవి లభిస్తుందా...? లేదా..? అన్న మీమాంసకు తెరపడింది. 2023 నవంబరు 30న రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి బరిలో దిగిన గడ్డంవివేక్ వెంకటస్వామి (చెన్నూరు), కొక్కిరాల ప్రేంసాగర్‌రావు (మంచిర్యాల), గడ్డంవినోద్ (బెల్లంపల్లి)లు భారీ మెజార్టీతో ప్రత్యర్థులపై గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నాటి నుంచే జిల్లాకు మంత్రి పదవి లభిస్తుందనే చర్చ జోరుగా సాగింది. అయితే ఏడాదిన్నర అనంతరం ఎట్టకేలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ చేపట్టడంతో జిల్లాకు చోటు లభించి నట్లయింది.

వివేక్ రాజకీయ నేపథ్యం..

తన తండ్రి, కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) వారసుడుగా గడ్డం వివేక్ తొలిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తరుపున 2009లో పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2009 నుంచి 2014 మధ్యకాలంలో పార్లమెంట్ సభ్యుడిగా ప్రాతి నిధ్యం వహించారు. అనంతరం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం కాంగ్రెస్‌ను వీడి టీఆర్ఎస్‌లో చేరారు. టీఆర్ఎస్ తరుపున 2014లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలవాలన్న ఆయన ఆకాంక్షకు పార్టీ అధిష్ఠానం చెక్ పెట్టింది. వివేక్‌ను కా దని, బాల్క సుమన్‌కు ఎంపీ టికెట్ ఇచ్చింది. దీంతో తిరిగి 2014లో కాంగ్రెస్‌లో చేరిన వివేక్, పార్టీ టికెట్‌పై పార్లమెంట్ బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో ఓటమిపాలైన వివేక్ అనంతరం వ్యక్తిగత కారణాల వల్ల కాంగ్రె స్‌ను వీడి తిరిగి 2016లో టీఆర్ఎస్‌లో చేరారు. అనం తరం 2017లో హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షు డిగా ఎన్నికయ్యారు. ఆ తరువాత టీఆర్ఎస్‌ను వీడిన వివేక్ 2019లో బీజేపీలో చేరారు. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు నవంబరు 21న బీజేపీని వీడి తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై చెన్నూరు నియోజక వర్గం నుంచి బరిలో దిగి విజయం సాధించారు. ఆ తరు వాత పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంటు స్థానం నుంచి తన కుమారుడు గడ్డం వంశీకృష్ణను బరిలో దింపి ఎంపీగా గెలవడంలో ప్రధానపాత్ర పోషించారు. వివేకా నంద సోదరుడు గడ్డం వినోద్ (మాజీమంత్రి) ప్రస్తుతం బెల్లంపల్లి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

మూడో విడతపై పీఎస్సార్ ఆశలు...

వాస్తవానికి జిల్లా నుంచి ఎన్నికైన ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వివేకానంద, ప్రేంసాగర్‌రావు, వినోద్‌లు మంత్రి పదవిపై మొదటి నుంచీ ఆశలు పెట్టుకున్నారు. ఏడాదిన్న రగా మంత్రి పదవికోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తూనే ఉన్నారు. రెండో విడుత మంత్రివర్గ విస్తరణ జరుగ బోతుం దంటూ ప్రచారం జరిగినప్పుడల్లా జిల్లా నుంచి మంత్రి పదవి ఎవరికి దక్కుతుందోనన్న...

(తరువాయి 7లో)

బెట్టింగ్ ఉచ్చులో యువత

- ఈజీ మనీపై ఆశతో తప్పటడుగు
- మొదట వేలల్లో పెట్టి.. లక్షల్లో అప్పుల పాలు
- ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్న యువత

7

రాబోయే ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మందమర్రిరూరల్, జూన్8 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మన సత్తాచాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడి ప్రభుత్వం పేద సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టిందని పేర్కొన్నారు. 11 సంవత్సరాల్లో గతంలో ఏ ప్రదాన మంత్రి చేయని సంక్షేమపథకాలను అమలు చేశారని పేర్కొ న్నారు. జిల్లా వ్యాప్తంగా బీజేపీని ప్రతిష్ట పరుచాలని ఆయన సూచించారు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ నిర్లక్ష్యంపై వ్యూహంతో వ్యవహరించాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు దేవరనేని సంజీవరావు, దుర్గం అశోక్, సీనియర్ నాయకులు దీక్షితులు, ప్రధాన కార్యదర్శి వంజరి వెంకటేష్, కర్రె రాజయ్య పాల్గొన్నారు.

మంత్రిని కలిసి..శుభాకాంక్షలు తెలిపి



మంత్రి వివేక్‌ను సన్మానిస్తున్న మందమర్రి కాంగ్రెస్ నాయకులు

మందమర్రి టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టిన వివేక్ వెంకటస్వామిని ఆదివారం మందమర్రి కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లోని సోమాజిగూడలో ఆయన నివాసంలో మర్యా దపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. స్వీట్లు తినిపించి బాణసంచా పేల్చారు. మందమర్రికి చెందిన తవక్కల్ విద్యా సంస్థల చైర్మన్, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్‌అజీజ్ కూడా వివేక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుర్గం నరేష్, రమేష్, రావికంటి వెంక టేషం, కొప్పుల కృష్ణ, గణేష్, ఉన్నారు.

మంచిర్యాలక్రైం: హైదరాబాద్ సోమాజిగూడలో మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని దళిత సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు సుధమల్ల హరిక్రిష్ణ పాల్గొన్నారు.

మంచిర్యాలకలెక్టరేట్: మంత్రి వివేక్‌ను తెలంగాణ బీసీ అధ్యక్షులు నీలకంఠేశ్వర్‌రావు, జిల్లా సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షులు సపాట్ శంకర్‌లు హైదరాబాద్‌లో వివేక్‌ను కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

మందమర్రిరూరల్: మంత్రిని కలిసిన వారిలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందె రాంచందర్, నీలయ్య, ఆకుల అంజి, మాజీ ఎంపీటీసీ దుర్గం కుమార స్వామి, దుర్గం సుధాకర్ ఉన్నారు

బెల్లంపల్లి : బెల్లంపల్లి పాతబస్టాండ్ అంబేద్కర్ చౌరస్తా వద్ద టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకున్నారు.

కార్మికుల గొంతుక మునీర్

మంచిర్యాలకలెక్టరేట్, జూన్8 (ఆంధ్రజ్యోతి): కార్మికుల, కర్షకుల గొంతుక సీనియర్ జర్నలిస్టు ఎండీ మునీర్ అని ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్, టీయుడబ్ల్యుజే(హెచ్143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, మంచి ర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సుచిత్ర ఫంక్షన్ హాల్‌లో మునీర్ అన్నా యాదిలో... అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మునీర్ చిత్రపటానికి అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, విలేకరులు, కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునీర్‌తో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పి సకల జనుల సమ్మెలో సింగరేణి జేఏసీ కన్వీనర్‌గా మునీర్ అందరిని సమన్వయం చేయడంలో సఫలీకృతుడయ్యారన్నారు. సింగరేణి కార్మికుల కష్టాలను స్వయంగా గనుల వద్దకు వెళ్లి ప్రత్యేక్షంగా కలిసి వారితో చర్చించేవాడని సింగరేణిపై వార్తలకు ఉత్తమ జర్నలిస్టు అవార్డును సొంతం చేసుకున్నాడన్నారు. రానున్న రోజుల్లో ము నీర్ పేరు మీద సింగరేణి ప్రాంత పెన్నీస్‌లకు ఏటా అవార్డును ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మునీర్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్‌గౌ డ్, సీనియర్ నాయకులు ముకేశ్‌గౌడ్, దుర్గం అశోక్, శ్రీదేవి, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిరియాల రాజి రెడ్డి, సీనియర్ నాయకుడు రామ్మూర్తి, టీయుడబ్ల్యుజ(హెచ్143) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారు తిసాగర్, జోగానంద, జిల్లా కన్వీనర్ ఉమేశ్, కో కన్వీనర్లు చెట్ల రమేశ్, రేణికుంట్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు, స్థానిక అడ్వకేట్ సంధాని, అబ్బాస్, విజయ్ పాల్గొన్నారు.

టీయుడబ్ల్యుజే(హెచ్143) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ



నివాళులు అర్పిస్తున్న అల్లం నారాయణ, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, తదితరులు

కమిటీ ఎన్నిక

మంచిర్యాలక్రైం, జూన్8 (ఆంధ్రజ్యోతి): అఖిలభారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా కార్యవర్గ సమావేశంలోనూ తన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశానికి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్ అధ్యక్షతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా పట్టణ అధ్యక్షుడిగా మల్లిఖా ర్జున్, ప్రధాన కార్యదర్శిగా ఎలుక సంతోష్, ట్రెజరర్‌గా లచ్చన్న, శ్రీనివాస్, శివరెడ్డి, రఘుపతిరావు, వేముల రాము, బేతి సత్యం, సిరిపురం రాజేశం, రాష్ట్ర పీఆర్‌వో భాస్కర్‌లు ఎన్నుకున్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

మంచిర్యాలక్రైం, జూన్8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం కాలేజీరోడ్డు సాంఘీక సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ అనూష తెలిపారు. 2025 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ పాసైన మహిళ విద్యార్థులు అన్ని క్యాటగిరీల్లో జనరల్, కంప్యూటర్ విభాగాల్లో కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2025 జనవరి తరువాత పొందిన ఆదాయ ధృ వీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రం, ఐదు పాస్‌ఫొటో సైజు ఫొటోలు, ఆధార్ జిరాక్స్, ఇంటర్‌మీడియట్, టీసీ ధృవీకరణ పత్రాలతో ఈనెల 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు.

సీఐఎస్ఎఫ్-ఎస్‌బీఐ ఒప్పందంతో మెరుగైన ప్రయోజనాలు

జైపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో జరిగిన సీఐఎస్ఎఫ్-ఎస్‌బీఐ ఒప్పందంతో మెరుగైన ప్రయోజనాలు పొందే అవకాశం ఉందని ఎస్‌టీపీపీ కమాండెంట్ చంచల్ సర్కార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వీసులో ఉన్న సిబ్బంది, పదవీ విరమణ చేసిన వారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రమాదబీమా, వైద్య సేవలు, విద్య సహాయం వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు.

ఒప్పందం ద్వారా వేతనాల ఖాతాల నిర్వహణ సౌకర్యం, బ్యాంకు రుణాలు వంటి అనేక ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు.

శాఖ ఏదైనా సమర్థవంతంగా నిర్వహిస్తా

- సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుకు కృషి చేస్తా
- మంత్రి వివేక్ వెంకటస్వామి



మాట్లాడుతున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

మందమర్రి టౌన్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఏ శాఖ కేటాయించినా దానిని సమర్థవంతంగా నిర్వహిస్తానని, పదవితో సంబంధం లేకుండా ప్రజలలో ఒక్కడిగా పని చేస్తానని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ మంత్రివర్గంలో చోటు లభించడం మరింత బాధ్యత పెంచిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని ఆయన చెప్పారు. అంతే కాకుండా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తానన్నారు. ఆదిలాబాద్, నిర్మల్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో చాలా సహజ వనరులు ఉన్నాయన్నారు. ప్రధానంగా ఆరు జిల్లాల్లో విస్తరించి ఉన్న సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. సింగరేణిలో త్వరలో అధిక శాతం గనులు మూత పడే అవకాశాలు ఉన్నాయన్నారు. చెన్నూరులో కూడా పలు గనులు మూతపడ్డాయని, ఓసీల ఏర్పాటుపై కూడా దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు కూడా అర్హులకు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు.

విద్యాభివృద్ధికి మౌలిక వసతులు అవసరం



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి మౌలిక వసతులు అవసరమని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలు పాఠశాల ఆవరణలో పీఎం జన్‌మన్‌లో భాగంగా రూ.2.50 కోట్లతో 10 డార్మెంటరీలతో నిర్మించ తలపెట్టిన పనులకు ఆదివారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగి అభివృద్ధి చెందాలంటే మౌలిక వసతులు ఎంతో అవసరమన్నారు. పీఎం జన్‌మన్‌లో భాగంగా నిర్మిస్తున్న హాస్టల్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు. దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు వస్తున్న విద్యార్థులకు వసతులతో కూడిన హాస్టల్ నిర్మాణం జరగనుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, ఉపాధ్యాయుడు రమేశ్, ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

జైపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన ఎల్కటూరి శివ పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్‌ను ఆదివారం అందజేసినట్లు జైపూర్ 2వ ఎస్ఐ రామలక్ష్మి తెలిపారు. ఎల్కటూరి శివ ఏడాది క్రితం మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వారి మొబైల్ ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు స్వాధీనం చేసుకొని బాధితుడికి పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే ఫోన్‌ను గుర్తించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు.

కర్జెల్లిలో బోనాలు



బోనాలతో తరలివస్తున్న మహిళలు

చింతలమానేపల్లి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జెల్లి గ్రామంలోని లక్ష్మీ దేవాలయంలో ఆదివారం బోనాల పండగను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఏటా వర్షాకాలం ముందు ఈ కార్యక్రమం జరుపుకోవడం అనవాయితీగా వస్తుందని తెలిపారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాలు, గురిగొడ్డు ఆటలు, లక్ష్మీ దేవర విన్యాసాలు ఆకటుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ పూజారి నాయిని భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన పాఠశాలను తెరిపించాలి




ప్రచారజాతాలో పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

కాగజ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మూతపడిన కాగజ్‌నగర్ మండలం వల్లకొండ పాఠశాలను వెంటనే అధికారులు తెరిపించేందుకు కృషి చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి శాంతికుమారి కోరారు. టీఎస్‌టీయూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రచార జాతాలో ఆమె మాట్లాడారు. గత విద్యాసంవత్సరం నుంచి మండల పరిషత్ పాఠశాల మూతపడిందన్నారు. దీంతో సుమారు 10 మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. ప్రస్తుతం పది మంది విద్యార్థులను ఇతర చోటకు పంపిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు మూతపడిన వల్లకొండ పాఠశాలను తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం రాజ్‌కమాలకర్ రెడ్డి, సురేష్, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సంక్షోభంలో పంచాయతీలు



ఆసిఫాబాద్ మండలంలోని ఓ గ్రామం

- నిలిచిన కేంద్ర ఆర్థిక సంఘం నిధులు
- పాలక వర్గాలు లేక నిధులు విడుదల చేయని కేంద్రం
- కార్మికులకు జీతాలు ఇవ్వని పరిస్థితి
- ప్రత్యేకాధికారుల పాలనలో కుంటుపడుతున్న అభివృద్ధి

ఆసిఫాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల నుంచి వివిధ పద్దుల నుంచి రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల నిర్వహణపై ప్రభావం పడుతోంది. గ్రామపంచాయతీలు మండల, జిల్లాపరిషత్ పాలకవర్గాల పదవి కాలం ముగియడంతో కేంద్ర ప్రభుత్వం రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను నిలిపి వేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడ స్థానిక సంస్థలకు నిధులు ఇచ్చే పరిస్థితుల్లో లేక పోవడంతో పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. గ్రామ పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు అప్పులుచేసి మరి అత్యవసర పనులు చేస్తున్నారు. కనీసం పారిశుధ్య పనులు చేయని పరిస్థితి, విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ల నిర్వహణ ముందుకు సాగడంలేదు. 15నెలల క్రితం పంచాయతీల్లో పాలకవర్గాల పదవీకాలం పూర్తయింది. వెంటనే ఎన్నికల నిర్వహించాల్సి ఉండగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన ప్రవేశ పెట్టింది. ఏడాదిన్నర కావస్తున్నా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ముందడుగు పడడం లేదు.

● జనాభా ఆధారంగా..

స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామాల జనాభాను బట్టి ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తోంది. జిల్లాలో 15మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు ఐదులక్షల జనాభా ఉన్నారు. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రంఇచ్చే గ్రాంటును అందులో కలిపి ఇవ్వాలనే నిబంధన ఉంది. కానీ పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధుల విడుదలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు. కేంద్రం నుంచి జిల్లాకు వచ్చే మొత్తం నిధులలో 85 శాతం గ్రామ పంచాయతీలకు కేటాయిస్తారు. దీంతో ఆయా పాలకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అభివృద్ధి పనులు చేసేందుకు అవకాశం ఉండేది. వచ్చిన నిధులలోనే ఆరుశాతం కార్యాలయ నిర్వహణ ఖర్చుకు వినియోగించాల్సి ఉంటుంది. పంచాయతీల్లో విద్యుత్, నెట్ బిల్లులు, వాహనాల అద్దె చెల్లింపులు ఇతరఖర్చులకు వినియోగించే వారు. కేంద్రం నిధులు నిలిపి వేయడంతో ఈ చెల్లింపులన్నీ నిలిచిపోయాయి.

● నిర్వహణకు ఇబ్బందులు..

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు మంజూరుకాక ఆయా గ్రామపంచాయతీల నిర్వహణ ఇబ్బందిగా మారుతోంది. పనులు చేసిన వాటికి సకాలంలో బిల్లులు మంజూరు కాక అభివృద్ధి, పారిశుధ్య పనులు ముందుకు సాగడంలేదు. పనులన్నీ ఖర్చుతో కూడుకున్నవే కావడంతో వాటిని ఏ విధంగా చేపట్టాలంటూ ప్రత్యేకాధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పారిశుధ్యనిర్వహణ పంచాయతీలకు సవాలుగా మారుతోంది. వర్షకాలం మొదలవుతున్నందున గ్రామాల్లో పారిశుధ్య పనులు చేయలేని పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని పలువురు కార్యదర్శులు వాపోతున్నారు. కార్మికుల వేతనాలు, అభివృద్ధి పనులు, ట్రాక్టర్లకు సంబంధించిన ఈఎంఐలు, విద్యుత్ చార్జీలు నెలనెలా చెల్లింపులకు నిధులు లేక ప్రత్యేకాధికారులు తలలు పట్టుకుంటున్నారు. నిధుల కొరత ఉండడంతో పంచాయతీలో పనిచేసే కార్మికులకు, సిబ్బందికి మూడు, నాలుగు నెలల జీతాలు పెండింగ్‌లోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

● కార్యదర్శులకు భారం..

గ్రామపంచాయతీల నిర్వహణ కార్యదర్శులకు భారంగా మారింది. వర్షకాలంలో గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనుగోలుకు కూడ డబ్బులులేని పరిస్థితి ఉంది. ప్రతినెల విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు, పారిశుధ్య కార్మికుల వేతనాలు, వీధి దీపాల నిర్వహణ తదితర పనులకోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి వస్తుందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. బిల్లులువస్తాయనే ఆశతో అప్పులు తీసుకువచ్చి మరీ పనులు చేయిస్తున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇటు బిల్లులు రాక అటు వడ్డీలుపెరిగి అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ఆర్థికసంఘం నిధులు విడుదలయ్యేలా చేయడంద్వారా గ్రామపంచాయతీల అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

జూలై 9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు

కాగజ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమానులకు అనుగుణంగా కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ జూలై 9న నిర్వహించే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవంగా మే 20న దేశ వ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని చెప్పారు. దేశంలో పహల్గాంలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడి అమాయకపు ప్రజల ప్రాణాలు బలిగొనడం, ఆ తర్వాత యుద్ధ వాతావరణం నెలకొనడంతో సమ్మె వాయిదా వేశామన్నారు. ఈ సమ్మె తిరిగి జూలై 9న చేపడుతున్నామని తెలిపారు. పని దినాన్ని 12 గంటలకు పొడిగించడం, సంఘం పెట్టుకొని సంఘటితంగా పోరాడే రాజ్యాంగపు హక్కును కాదనడం తదితర నిబంధనలు సరికాదని చెప్పారు. కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్న ప్రధాన డిమాండుతో ఈ సమ్మె చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముంజం శ్రీనివాస్, రాజేందర్, ఆర్ త్రివేణి, ఎన్ పద్మ, కృష్ణమాచారి, శంకర్, చంద్రన్న, మాయ, రూప, శారద తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య



మణికంఠ(ఫైల్)

భీమారం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య చేసుకున్న ఘటన భీమారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎస్ఐ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన గంట్ల మణికంఠ(26) కుటుంబ ఆర్థికంగా అప్పుల్లో మునిగాడు. అప్పులు ఇచ్చిన వారు ఇంటికి రావడం, ఫోన్లు చేయడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించగా, అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి జయరాంరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కాసిపేట,జూన్8(ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని మద్దిమాడ సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడిన ఘటనలో మద్దిమాడకు చెందిన యువకుడు బైరినేని అర్జున్(22) మృతి చెందాడని దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. దేవాపూర్ పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అర్జున్ మద్దిమాడ నుంచి దేవాపూర్‌కు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా అతివేగంగా వచ్చిన బైక్ స్పీడు బ్రేకర్ వద్ద అదుపు తప్పి కిందపడి పోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కాగా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు ఓరియంట్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

బ్రిడ్జి నిర్మించారు.. అప్రోచ్ రోడ్డు మరిచారు..



పూర్తి చేయని అప్రోచ్ రోడ్డు (ఇన్‌సెట్‌లో పూర్తయిన బ్రిడ్జి)

సిర్పూర్(టి), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేంపల్లి పై ఓవర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పనులను అధికారులు పూర్తి చేయడం లేదు. మండలంలోని సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై వేంపల్లి గ్రామ సమీపంలో రైల్వే గేటు వద్ద 2016 లో రూ.30.03 కోట్ల నిధులతో అప్పటి ప్రభుత్వం ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టింది. ఇప్పటి వరకు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. బ్రిడ్జి పనులు పూర్తి అయినప్పటికీ అప్రోచ్ రోడ్డు పూర్తికాక పోవడంలో నిర్లక్ష్యంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. పాలకుల అసమర్థతతో కాంట్రాక్టర్ నిర్మాణ పనులను అసంపూర్తిగా చేశారని చెబుతున్నారు. కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సరిగ్గా బిల్లులు చెల్లించక పోవడం వల్లేనని అంటున్నారు. ఈ దారి గుండా బెజ్జూరు, కౌటాల, చింతలమానేపల్లి, సిర్పూర్(టి) మండలాల నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి భారీ వాహనాలు రాక పోకలు సాగిస్తుంటాయి. ఫ్లైఓవర్ అప్రోచ్ రోడ్డు పూర్తి కాక పోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గాన్నే జిల్లా, మండల ఉన్నత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం వెళ్తుంటారు. కానీ ఎవరు పట్టించుకోవడం లేదని ఆయా మండలాల ప్రజలు చెబుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాద సూచిక ఏర్పాటు చేయాలి



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కెరమెరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటారి గ్రామం వద్ద ఆసిఫాబాద్- ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై కల్వర్టు వద్ద కోతకు గురై ప్రమాదకరంగా మారిందని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోటారి, రింగన్‌ఘాట్, అంబారావుగూడతో పాటు పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ రోడ్డు మీదుగా రోజు పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కల్వర్టు వద్ద రోడ్డు సమాంతరంగా ఉంది. దీంతో రెండు పెద్ద వాహనాలు సైడ్ ఇచ్చే క్రమంలో రాత్రి వేళలో కల్వర్టులో పడిపోయే ప్రమాదం ఉందని, అధికారులు స్పందించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల నిర్మాణానికి ముగిసిన సర్వేలు

- » నిధుల మంజూరుకు ప్రతిపాదనలు
- » పనులు పూర్తయితే వాహనదారులకు తీరనున్న కష్టాలు



గుంతలమయంగా మారిన సిర్పూరు(టి)-మాకొడి రోడ్డు

కాగజ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రోడ్డు పనులు కోసం హ్యాం(హైబ్రిడ్ యాన్యూటీ మోడల్) ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని గ్రామీణ రహదారుల కోసం సర్వేలు పూర్తయ్యాయి. ఈ సర్వేల ప్రధాన లక్ష్యం పంచాయతీ రోడ్లు, ఆర్ అండ్ బీ రోడ్లను అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా పంచాయతీ రాజ్ పరిధిలోని 18,484 కిలోమీటర్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లు 12,000 కిలో మీటర్ల రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా కుమరం భీం జిల్లాలో కూడా సర్వేలు పూర్తి చేశారు. ఈ సర్వేల్లో ప్రధానంగా కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి సిర్పూరు(టి) వరకు, సిర్పూరు(టి) నుంచి మకొడి వరకు, దహెగాం మండలం కల్వాడ నుంచి ఒడ్డుగూడ వరకు మూడు నెలలుగా ఈ రోడ్లపై సర్వేలు పూర్తి చేశారు. కాగజ్‌నగర్ - సిర్పూరు(టి) వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డు ఎలా అభివృద్ధి చేస్తారనేది విషయంలో హ్యాం సంస్థ ప్రతినిధులు నివేదికలను రూపొందించారు. ఈ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసిన తర్వాత మరో మూడు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి అభివృద్ధి చేసే అవకాశం ఉంది. కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి సిర్పూరు(టి) వరకు వెళ్లే రహదారిలోని వేంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద వాహనాలు పోలేని పరిస్థితి ఉంది. ఈ ప్రాంతం అంతా కూడా గుంతలమయంగా ఉంది. ద్విచక్రవాహనాలు పోయేందుకు కూడా ఇబ్బందికరంగా ఉంది. అధికారులకు, నాయకులకు పలుమార్లు విన్నవించినా కూడా ఇంతవరకే పురోగతి లేని పరిస్థితి ఉంది. వర్షాకాలంలో ఈ గుంతల్లో నీరు నిండి ఉండడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ రోడ్డు పనులు జరిగే అవకాశాలు ఉండడంతో తమ సమస్యలు పూర్తి స్థాయిలో తీరుతాయన్న ఆశతో అంతా ఉన్నారు.

మాకోడికి వెళ్లేందుకు..

సిర్పూరు(టి)-మాకోడికి వెళ్లేందుకు కూడా రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదు. రోడ్డు గుంతలమయంగా మారింది. గుంతలు పడిన రోడ్డుపై రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దీంతో తెలంగాణ మహారాష్ట్రకు అనుసంధానంగా ఉండే ఈ ప్రధాన రోడ్డును అభివృద్ధి చేసే దిశగా సర్వేలను పూర్తి చేశారు. నిధులు త్వరితగతిన విడుదల చేయాలని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా అధికారులు తగిన చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు తెలిపారు. దీంతో పాటు దహెగాం మండలం ఇట్యాల నుంచి ఒడ్డుగూడ వరకు రోడ్డుకు ఇక బాటలు పడనుంది. హ్యాం సంస్థ సర్వేలు పూర్తి చేయడంతో ఈ ప్రాంత వాసులు తమ కష్టాలు తీరుతాయని కొండంత ఆశతో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల విస్తరణ ప్రక్రియ మరింత వేగవంతం చేసి రోడ్లను అభివృద్ధి చేసేందుకు చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్ అండ్ బీ డీఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా హ్యాం ఆధ్వర్యంలో సర్వేలు పూర్తి చేశామని వివరించారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే టెండరు ప్రక్రియకు నిర్వహిస్తామని తెలిపారు.



దెబ్బతిన్న సిర్పూర్(టి) రోడ్డు

పర్యాటకులకు కనువిందు

స్వేచ్ఛగా తిరుగుతున్న వన్య ప్రాణులు

జన్నారం, జూన్8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ అభయారణ్యంలో పర్యటించేందుకు వచ్చే పర్యాటకులకు వన్య ప్రాణు లు కనువిందు చేస్తున్నాయి. జన్నారం రేంజ్ గోండుగూడ అటవీప్రాంతంలో ఆదివారం ఉదయం పర్యాటకులు సఫారీలతో వెళ్లగా ప్రధాన రహదారిపై అడవి దున్నలు స్వేచ్ఛగా తిరుగుతూ కనువిందు చేశాయి. మరోపక్క గుంపులుగా పరుగులు పెడుతూ కనిపించాయి.

మద్యం తాగి వాహనాలు నడుపవద్దు

హాజీపూర్, జూన్8 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపవద్దని హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ అన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఆదివారం సాయంత్రం డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం తాగి పట్టుబడినవారిపై కేసులు నమోదు చేశారు. వారిని సోమవారం ఉదయం పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్లు చంద్రశేఖర్, తిరుపతి, రవి పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు సాగు.. కేసు నమోదు

బెల్లంపల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన పోచన్న అనే వ్యక్తి తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారం మేరకు తనిఖీ చేయగా 8 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయని తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ ఆదివారం తెలిపారు. పోచన్న గంజాయి సాగు చేసి అధిక డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి సాగు చేశాడని సాగు చేసిన మొక్కలను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎన్నిక

జన్నారం, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొర్రిగూడ గ్రామానికి చెందిన రాకేశ్ దేవెల్ల జువాలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా లైఫ్ మెంబర్‌గా ఎంపికైనట్లు తెలిపారు. జంతు శాస్త్రంలో రాకేశ్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి పర్యవేక్షణలో రుమెక్స్ వాస్కరియాస్ ఆకు నుంచి ఆంటిడయో బెటిక్ ఏజెంట్‌ను వేరు చేయడం, లక్షణాలను నిర్ధారించడం వంటి పరిశోధనలు చేయడంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ యూనివర్సిటీలోని పెస్టిసైడ్ సేవలందించనున్నట్లు తెలిపారు.

బెట్టింగ్ ఉచ్చులో యువత



జైపూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత తరుణంలో యువత బెట్టింగ్‌లకు ఆకర్షితులై చిన్న వయస్సులోనే చిత్తవుతున్నారు. పట్టణాల నుంచి పల్లెల వరకు బెట్టింగ్ ఒక జూదంలా మారింది. రకరకాల బెట్టింగ్‌యాప్‌లు, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడిన యువత హద్దులు దాటి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. మొదట స్నేహితుల వద్ద వేల రూపా యల్లో అప్పులు చేస్తూ బెట్టింగ్‌లు ఆడుతూ తర్వాత ఆ అప్పులు తీర్చేందుకు మరింత వడ్డీకి అప్పులు తెచ్చి లక్షల రూపాయలు మోసపోతు న్నారు. తక్కువ కాలంలో ఎక్కువ సంపాదించాలనే కోరిక కొందరిదైతే, జల్సాలకు అలవాటు పడిన యువత బెట్టింగ్‌ను ఒక ట్రెం డ్‌గా బావిస్తూ ఆడుతున్నారు.

● తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు...

తల్లిదండ్రులు వారి కుమారులను పట్టణాల్లో డిగ్రీ లు, బీటెక్‌లు చదివించి ఉన్నత భవిష్యత్ గురించి ఆశి స్తుంటే వారు చేసిన లక్షల రూపాయలు అప్పులు తల్లి దండ్రులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కొందరు యువకులు అప్పులు తీర్చలేక ఆత్మహత్య లకు పాల్ప డుతుండగా మరికొందరు తల్లిదండ్రులు వారి కుమారులు చేసిన అప్పులు తీర్చేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

● జైపూర్ మండలంలో జరిగిన కొన్ని ఘటనలు

మండలంలోని రామారావుపేటకు చెందిన ఓ యు వకుడు హైద్రాబాద్‌లో ప్రైవేటు కంపెనీ స్థాపించి 5 శాతం కంటే ఎక్కువ వడ్డీ చెల్లిస్తానని చెప్పి బంధువులు, స్నేహితుల నుంచి లక్షల రూపాయలు సేకరించా డు. షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడతానని చెబు తూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ. 50 కోట్లు వసూ లు చేశాడు. ఆరు నెలల క్రితం ఐపీ పెట్టి పరారయ్యా డు. దీంతో బాధితులు మోసపోయారు.

● మండల కేంద్రానికి చెందిన ఓయువకుడు కరీంనగర్‌లో బీటెక్ చదువుతున్నాడు. బెట్టింగ్‌లపై మోజుతో స్నేహితుల వద్ద రూ. 10లక్షల అప్పులు చేశా డు. ఇటీవల అప్పు చేసిన విషయం తల్లిదండ్రులకు తెలియ డంతో వారు ఆందోళనకు గురయ్యారు. చదువు కోసం వెళ్లిన యువకుడు బెట్టింగ్‌లో మునిగిపోవడం, అప్పులు ఇచ్చిన ఇంటికి రావడంతో స్థానికంగా ఈ విషయం చర్చనీయాంశమైంది.

● మండలంలోని గంగిపెల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ యాప్‌లలో సుమారు రూ. 15 లక్షలు పోగొట్టి తల్లిదండ్రులకు చెప్పలేక ఏడాది క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

"తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలి"

తల్లిదండ్రులు ఎప్పుడు వారి పిల్లల ప్రవర్తనను గమని స్తూఉండాలి. సెల్‌ఫోన్‌లను అవసరం మేరకే వినియోగించేలా చూడాలి. బెట్టింగ్ యాప్‌లలో మొదట కొన్ని డబ్బులు పెడుతూ వచ్చిన తర్వాత అదే అలవాటుగా మారి అప్పులు చేసి మోసపోతున్నారు. ఎవరు ఊరికే డబ్బులు ఇవ్వరు. ఈజీ మనీకి అలవాటు పడి మోస పోతున్న వారు అప్పుల పాలవుతున్నారు. యువత బెట్టింగ్‌యాప్‌లకు దూరంగా ఉండాలి.



\- శ్రీధర్, ఎస్ఐ జైపూర్

మార్కెట్‌లో మృగశిర సందడి

బెల్లంపల్లి/దండేపల్లి, జూన్8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం మార్కెట్‌లో చేపల విక్రయాలతో సందడి నెలకొంది. మృగ శిర రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని, అస్తమా వ్యాధులు రాదనే నమ్మకంతో ప్రజలు ఎక్కువగా చేపలు కొనుగోలు చేశారు. దీంతో చేపల మార్కెట్ కొనుగోలు దారులతో కిటకిటలాడాయి. చేపలు కొనుగోలు చేయాలంటే గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈసారి చేపల ఉత్పత్తి తక్కువగా ఉండడంతో విక్రయదారులు ఎక్కువ ధరకు అమ్మకాలు చేపట్టారు. మామూలు రోజుల్లో ఆయా చేపలు రూ. 150 నుంచి 500 వరకు చేపల్లోని రకాలబట్టి విక్రయించేవారు. మృగశిర రోజు 300 నుంచి 600 వరకు కిలో చొప్పున విక్రయాలు చేపట్టారు.

హాజీపూర్: మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం మండల వ్యాప్తంగా చేపల కొనుగోలు కోసం బారులు తీరారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గుడిపేట వద్ద వందల సంఖ్యలో జనం చేపల కోసం క్యూలైన్‌లో నిల్చున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు గుడిపేట వద్ద పండగ వాతావరణం నెలకొంది. కొందరు ఐస్ చేపలు తీసుకొచ్చి అమ్మడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



చేపల కోసం బారులు తీరిన జనం

వరించిన మంత్రి పదవి..

(5వ పేజీ తరువాయి)

చర్చ ప్రజల్లోనూ హాట్ టాపిక్‌గా మారేది. కొంతకాలంగా వివేక్, ప్రేంసాగర్‌రావు మధ్యనే పోటీ అన్న ప్రచారం ఊపందుకుంది. వివేక్ వైపే ఢిల్లీ పెద్దలు మొగ్గు చూపుతున్నారనే ప్రచారం జరుగగా, ప్రేంసాగర్‌రావు కూడా గట్టి ప్రయత్నమే చేస్తున్నారనే వాద నలూ వినిపించాయి. చివరికి ఏఐసీసీ పెద్దలు చెన్నూరు ఎమ్మెల్యే వివేకానందకే పట్టం కట్టగా, మూడో విడుత మంత్రివర్గ విస్తరణలో తనకు తప్పకుండా చోటు లభిస్తుందన్న గట్టి నమ్మకంతో ప్రేంసాగర్‌రావు ఉన్నారు. రేవంత్ ప్రభుత్వంలో మొత్తం ఆరు మంత్రి స్థానాలు ఖాళీగా ఉండగా, ప్రస్తుతం మూడు భర్తీ చేశారు. మరో ముగ్గురిని భర్తీ చేయాల్సి ఉండగా, వెల్మ సామాజిక వర్గంలో తనకు అవకాశం వస్తుందనే భావనలో పీఎస్సార్ ఉన్నారు. కాగా బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా నిర్జీవ స్థితికి చేరుకోగా, ఉమ్మడి జిల్లాలో మాత్రం సజీవంగా ఉండటానికి ప్రేంసాగర్‌రావు కారణమని ప్రజలు బలంగా నమ్ముతారు. 10 సంవత్సరాలుగా ఎలాంటి ముఖ్యమైన పదవులు లేకపోయినా ప్రేంసాగర్‌రావు పార్టీని నడిపిస్తూ వచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అధ్యాపకులతో పాటు పూర్వ విద్యార్థులు

మంచిర్యాలక్రైం, జూన్8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీవిరామన్ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీవిరామన్ కళాశాల ఫౌండర్ గురిజాల రవీందర్ రావు, శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొనగా 1997, 2007 బ్యాచ్‌లకు సంబంధించిన డిగ్రీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. వారి ఆటపాటలు ఎంతో అలరించాయి. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ 25 సంవత్సరాల తరువాత అందరూ ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగిచిందన్నారు. ఈ సమ్మేళనంలో ఫౌండర్ రవీందర్‌రావు, అధ్యాపకులు చాలేకర్, భూపతి, మాజీ ప్రిన్సిపాల్ సంపత్‌లతో పాటు నల్ల నరేశ్, ప్రకాశ్, ఆర్గనైజర్ కస్తూరి శ్రీధర్, వేముల శేఖర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కాసిపేట, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మరావుపేటలో ఆదివారం మంచిర్యాల శంకర్ నేత్రాలయం కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీనికి వందమందికిపైగా కంటి బాధితులు హాజరుకాగా వంద మందికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరం కానున్నాయి. వీరికి వారం రోజుల్లో శస్త్ర చికిత్సలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులను అందజేస్తామని చిందం అభిషేక్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలోని మహిళలు ఎక్కువ మంది కంటి సమస్యలతో బాధపడుతుంటారు. కొంతకాలంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కంటి బాధితులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేసన్ మండల అధ్యక్షులు ముత్యాల రాజమౌళి, మాజీ సర్పంచ్ భుక్య రవి, స్థానిక నాయకులు ఉడుతల రాజన్న, పోలు, ముత్యాల కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

అసత్య ప్రచారం మానుకోవాలి

జన్నారం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్ అటవీ ప్రాంతంలోని ఇంధన్‌పల్లి, కవ్వాల ప్రాంతంలో ఇటీవల ఇసుక తరలిస్తున్నారన్నా సమాచారంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేయగా బీట్ అధికారి రుబీనపై దాడి చేసినందుకు కేసులు చేశామని రిమాండ్‌కు వెళ్లివచ్చిన తరువాత అటవీశాఖపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. అదే కాకుండా అటవీశాఖ అధికారుల ఇండ్లలో ఉన్న ఫర్నీచర్‌కు పర్మిట్ లేదంటూ అటవీశాక అధికారులపై కావాల్సికొని ఓ ఛానల్‌లో దుష్ప్రచారాలు చేస్తున్నారని ఇలాంటివి మానుకోకుంటే చట్ట రీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో హన్మంతు, బీట్ అధికారులు భీమయ్య, రుబీనా, ప్రణయ్, పోచయ్య, రాజేందర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

కోల్‌బెల్ట్‌లో జర్నలిస్టు మునీర్ అవార్డులు ఇవ్వాలి

మందమర్రి టౌన్, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమ నేత దివంగత ఎండి మునీర్ పేరిట జర్నలిస్టులకు అవార్డులు ప్రవేశపెట్టాలని, జిల్లాలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ రెవెలేషన్ యూత్ ఆధ్వర్యంలో మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్, వర్కింగ్ జర్నలిస్టు అధ్యక్షులు అల్లం నారాయణకు రెవెలేషన్ యూత్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఆదివారం మంచిర్యాలలో జరిగిన మునీర్ సంతాప సభకు హాజరైన నాయకులకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. మునీర్ మృతి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి రమేష్, రేణికుంట్ల శ్రీనివాస్, మర్రి దీపక్, నేముల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చేప మందు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

దండేపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సోమవారం దండేపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించ తలపెట్టే ఉచిత చేప మందు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఆదివారం నుంచి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ , కర్ణటక, సిరివాంచ, ఇతర రాష్టాల నుంచి ప్రజలు పిల్లలతో సహా తరలివచ్చారు. వీరి కోసం నిర్వహకులు దండేపల్లి పాఠశాలలో వారిందరికి ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయడమే కాకుండా, రాత్రి బస చేసేందుకు ఏర్పాటు చేశారు. వచ్చిన వారికిందరి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు-సురేఖ దంపతుల సహకారంతో కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ ద్వారా అన్నదానం కూడా ఎర్పాటు చేశారు. సోమవారం ఉదయం చేప మందు పంపిణీ చేయనున్నామని, ఆస్తమా ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నిర్వహకులు, గ్రామస్థులు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

జన్నారం, జూన్8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం డివిజన్‌లో గల ఇంధన్‌పల్లి రేంజ్‌లో ఆదివారం మంచిర్యాల డీఎఫ్‌వో శివ్ ఆశిశ్‌సింగ్ పర్యటించారు. ఈ సందర్భంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ముఖ్యంగా అటవీ సంరక్షణతో పాటు వన్య సంరక్షణ కోసం చేపట్టిన పనులను పరిశీలించారు. వర్షాకాలంలో నీటి నిల్వలతో పాటు అటవీ సంరక్షణ చేపట్టిన పనులపై ఇంధన్‌పల్లి రేంజ్ అధికారి వివరించారు. ఆయన వెంట అటవీ సంరక్షణ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

● గీత కార్మికుల జీవనాధారానికి ముప్పు

● బెజ్జాల గ్రామంలో వివాదంలో 20ఎకరాల భూమి

జైపూర్, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జాల గ్రామంలో సర్వే నెంబర్ 352కి చెందిన సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమిపై అక్రమార్కులు కబ్జాకు పాల్పడుతున్నారు. దశాబ్దాలుగా గీతవనాలను అభివృద్ధి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులు ఖబ్జాను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గౌడ కులస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఇద్దరు సొసైటీ సభ్యులు సుమారు ఐదు ఎకరాల భూమిని ఆ క్రమించుకున్నట్లు ఆరోపిస్తున్నారు. సదరు సొసైటీ వ్యక్తులతో మరో వ్యక్తికూడా ఈ కబ్జా బాగోతానికి తెర లేపినట్లు తెలుస్తోంది. ఈ కారణంగా సుమారు 250 ఈతచెట్లు నాశనం అయ్యాయని గీత కార్మికులకు ఉపాధికి ముప్పు వాటిల్లుతోందని కుల సంఘ సభ్యులు వాపోతున్నారు. ఈ స్థలంలోని ఈత చెట్లను తొలగించిన మూలంగా 21 కుటుంబాలు రోడ్డున పడు తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.



బెజ్జాలలో చదును చేసిన ప్రభుత్వ భూమి

జీవనాధారాన్ని నాశనం చేస్తున్నారు

మోత్కూరి రవీందర్‌గౌడ్, బెజ్జాల



బెజ్జాల గ్రామంలో 30 సంవత్సరాల నుంచి ఈత వనంపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నాం. భూమి కబ్జాకు పాల్పడుతున్నా అధికారులు ఇంత వరకూ చర్యలు తీసుకోలేదు. రెవెన్యూ అధికా రులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలి.

ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు

తహసీల్దార్ వనజా రెడ్డి

ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ఎవరైన ప్రయత్నిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. బెజ్జాల గ్రామంలోని 352వ సర్వే నెంబర్ భూమి కబ్జాకు గురైనట్లు మాకు సమాచారం అందింది. సిబ్బందిని పంపించి విచారణ చేపడుతాం. ప్రభుత్వ స్థలాల కబ్జా చేస్తే ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటాం.

క్వారీ అడవిలోకి నేషనల్ పార్కు జింకలు

హాజీపూర్, జూన్8 (ఆంధ్రజ్యోతి): పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలోని హాజీపూర్ మండల క్వారీ అడవిలోకి ఆదివారం నేషనల్ పార్కు నుంచి తీసుకొచ్చిన 15 జింకలను వదిలినట్లు లక్షెట్టిపేట రేంజ్ ఆఫీసర్ అత్తె సుభాష్ తెలిపారు. సి.నో 667లో సఫారి ఏరియాలో గల గడ్డి మైదానాల్లో మహావీర్ హరిన వనస్థలి నేషనల్ పార్కుకు హయత్‌నగర్ హైదరాబాద్ నుంచి 15 జింకలను తీసుకొచ్చినట్లు తెలిపారు. సఫారీ రోడ్డులో వీక్షకులకు జింకలు కనువిందు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్ఎస్ఓ ఫ్లైయింగ్ స్క్వాడ్ కొప్పుల రవి, ఎఫ్ఎస్‌వో హతహుల్ల, ఎఫ్‌బీలు రాజేందర్, స్వప్నలు పాల్గొన్నారు.

అడ్లూరికి మంత్రి పదవిపై సంబరాలు

దండేపల్లి,జూన్ 8(ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కు మంతి పదవి రావడం పట్ల దండేపల్లి మండల ఎంఆర్‌పిఎస్ మండల శాఖ అధ్వర్యంలో ఆదివారం దండేపల్లి అంబెద్కర్ విగ్రహం వద్ద సంఘ నాయకలు సంబరాలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం కేక్ కట్ చేసి టపాసు కాల్చిచేశారు. అడ్లూరి లక్ష్మణ్‌ను మంత్రి పదవి ఇవ్వడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు క్యాబినెట్‌లో సముచిత స్థానం కల్పించడం ఎంతో సంతోషమన్నారు. ఎంఆర్‌పిఎస్, అంబేద్కర్ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

బంజారాల సమస్యలపై పోరాటం చేయాలని వినతి

మంచిర్యాలకలెక్టరేట్, జూన్8 (ఆంధ్రజ్యోతి): బంజారాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌కు జిల్లా సంఘం నాయకులు శంకర్ ఆధ్వర్యంలో వినతిప్రతం అందజేశారు. బంజారాల హక్కులను ఇతరులను హరించుకుపోతున్నారని ఉద్యోగాల రాజకీయ రిజర్వేషన్ల పట్ల లంబాడాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తాండ అధ్యక్షులు భానోత్ సకలాల్‌నాయక్, బల్‌రాం నాయ క్, సదానందం, బాలు, కుమార్, లక్ష్మన్ చందు పాల్గొన్నారు.

పిల్లలను సర్కార్ బడిలో చదివించండి

దండేపల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ద్వారక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం చిన్న నరసయ్య కోరారు. ప్రొఫెసర్ జయ శంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆ దివారం మండలంలోని పెద్దపే టలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి మీ పిల్లలను సర్కార్ బడిలో చేర్పించాల న్నారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి పేర్లు నమోదు చేయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, వారి విద్యాబోధన విద్యార్థుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్‌పి, అంగన్‌వాడి టిచర్లులు పాల్గొన్నారు.



పెద్దపేటలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం

●ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా తలపెట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ద్వారా బడిఈడు పిల్లలను సర్కార్ బడిలో చదివించే దిశగా పిల్లల తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా వెనుబడిన తరగతుల అభివృద్ధి అధికారి అజ్మీర పురు షోత్తం నాయక్ కోరారు. కోర్విచెల్మలో బీమన్నగూడ వరకు ఆదివారం బడిబాట ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వయోజన విద్యా శాఖ డిఆర్‌పి రెడ్డి మల్ల ప్రకాశం, కోండు జనార్ధన్. నలుమాసు సుధాకర్, నావనవేని రవి, గొంటి భూమన్న, ఆర్ శ్రీనివాస్, విజయ్‌చంద్, హెచ్ఎం పద్మ పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ ఇవ్వడం గొప్పతనం

గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ చైర్మన్ కొట్నాక తిరుపతి

లక్షెట్టిపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈకాలంలో పేద విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందజేయడం అంటే చాలా గొప్ప విషయం అని రాష్ట్ర గిరిజన సంక్షేమ అభివృద్ధి శాఖ చైర్మన్ కొట్నాక తిరుపతి అన్నారు. పట్టణంలోని గ్లోబల్ కంప్యూట్ ఇనిస్ట్యూట్ ఆధ్వర్యంలో 45రోజుల శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులక ఆదివారం సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతీ ఒక్కరికి కంప్యూటర్ శిక్షణ చాలా అవసరం అన్నారు. పేద గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని గ్లోబల్ కంప్యూటర్ ఇనిస్ట్యూట్ సంస్థ ప్రతీ ఏటా విద్యార్థులకు ఈఅవకాశం కల్పించడం సంతోషం అన్నారు.

ప్రతీ ఏటా ఇలానే శిక్షణ ఇస్తూ ముందుకు సాగాలని సంస్థ మేనేజర్ కాంగ్రెస్ నాయకులు బొప్పు సుమన్‌ను కోరుతూ అభినందించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం త్రిమూర్తి, చింత అశోక్ కుమార్, పూర్ణచందర్‌రావు, అంకతి శ్రీనివాస్, ఎండీ. ఆరీఫ్, పింగిళి రమేష్, రాజు, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జీసీసీ చైర్మన్ తిరుపతి

నిత్యావసర సరుకులు పంపిణీ

లక్షెట్టిపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన గంధం నరేష్ అనే వ్యక్తి ఇటీవల అనా రోగ్యంతో మృతి చెందాడు. మృతుడు నిరుపేద కావడంతో మిట్టపెల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ ఉమాపతిరావు ఆదివారం మృతుని కుటుంబ సభ్యులకు 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రత్నం అంజి, గంధం ఏశావ్ తదితరులు ఉన్నారు.

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

లక్షెట్టిపేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ పేద ప్రజలకు ప్రభుత్వం ఇళ్లను మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు అన్నారు. ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సీపీఐ పార్టీ 3వ మహాసభల సమావేశంలో ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 2లక్షల రుణమాఫీ చేస్తానన్న ప్రభుత్వం చేయలేక పోయిందని పేద ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పథకాలు అందేలా చూడాలన్నారు. అంతే కాకుండా ఆపరేషన్ కర్గాన్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు మేదరి దేవవరం, కేతిరెడ్డి రమణరెడ్డి, దేవదాసు, బైరి రాజన్న, తిప్పని సత్తన్న, బానుచందర్ పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానించిన అటవీశాఖ అధికారులు



ఎస్ఐని సన్మానిస్తున్న అధికారులు

జన్నారం, జూన్8 (ఆంధ్రజ్యోతి): మండల ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన జి. అనూషను ఆదివారం ఇందన్‌పల్లి ఎఫ్ఆర్‌వో కారం శ్రీనివాస్‌తో పాటు అట వీశాఖ సిబ్బంది ఎస్ఐని మర్యాదపూర్వ కంగా కలిశారు. అనంతరం ఆమెను శాలువాతో సన్మానించి మండల విషయంలో చర్చించారు. శాఖల పరంగా ఒకరి కొకరు సమన్వయంతో పని చేసుకోవాలని అన్నారు. తన సహకారం ఎళ్లప్పుడూ ఉంటుందన్నారు. శాంతిభద్రతల విషయంలోనూ కలిసి విధులు నిర్వహించుకోవాలన్నారు. సిబ్బంది హన్మంతు, రుబీనా, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



ఈ ఏడాదైనా అమలుకు నోచుకునేనా..?

- ఇంటర్ విద్యార్థులకు కలగానే మధ్యాహ్న భోజనం
- పస్తులుండి చదువుతున్న విద్యార్థులు
- అడ్మిషన్లు, హాజరు శాతంపై ప్రభావం
- 2 నుంచి ప్రారంభమైన జూనియర్ కళాశాలలు

ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు కలగా మారింది. ఇంటర్ విద్యార్థులకు పథ కం ప్రవేశపెట్టాలని గత ప్రభుత్వంలోని మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. కానీ ఇప్పటి వరకు అమలుకు నోచుకోక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

బెజ్జూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. విద్యార్థుల భవిత పునాదుల స్థాయిలోనే కునారిల్లుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినా ఆచరణకు నోచుకోలేదు. పేదరికంతో అల్లాడుతూ తమ పిల్లలు తమలాగా కష్టపడకూడదని తల్లిదండ్రులు కళాశాలలకు పంపించి ప్రభుత్వం ప్రకటించిన మధ్యాహ్న భోజనంపై ఆనందం వ్యక్తం చేశారు.

ఇక తమ పిల్లలకు మధ్యాహ్నం సమయంలో పస్తులు ఉండాల్సిన పరిస్థితులు లేకుండా పోతాయని ఆశించారు. కానీ అప్పటి ప్రభుత్వ హామీ కేవలం ప్రకటనలకే పరిమితం కావడంతో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రుల ఆనందం ఆవిరైపోయింది. దీంతో కళాశాలకు వచ్చే విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తూ అధ్యాపకులు చెప్పే పాఠాలు అర్థం కాక మిన్నకుండిపోతున్నారు. ఉదయం ఇంట్లో తిన్న ఆహారమే తప్ప కళాశాలకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి సదుపాయం లేక పస్తులుంటున్నారు. మండలాల వారిగా ఒకే కళాశాల ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. దీంతో ఆకలితో అలమటిస్తూ చదువుపై దృష్టి సారించలేక పోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. ఈనెల 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం అమలుపై ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఐదేళ్ల క్రితం ప్రకటన..

సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అప్పటి వరకు బాగానే ఉన్నా పట్టణాల్లోని ప్రభుత్వ కళాశాలల్లో అడుగు పెట్టగానే భోజనం విషయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. బయట హోటల్‌లో భోజనం చేసే స్తోమత లేక ఆకలితో అలమటిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తామంటూ అప్పటిప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రకటించినా అమలుపై స్పష్టత లేకపోవడంతో అమలు కాలేదు. అప్పటి మంత్రివర్గ సమావేశంలోనూ ఇందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకున్నా ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల కాకపోవడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సిర్పూర్ నియోజకవర్గ పరిధిలో..

గతంలో అప్పటి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. కళాశాలల్లో విద్యార్థులు పస్తులు ఉండకూడదన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయించారు. ఏటా నాలుగు నెలల పాటు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేవారు. అప్పటి ఎమ్మెల్యే కోనప్ప స్ఫూర్తితో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తామని స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అధిక ఫలితాలు కూడా సాధించారు. అప్పటి ప్రభుత్వం ప్రకటించి ఐదేళ్లు కావస్తోంది.

అయితే రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు ఈ పథకంపై ఎలాంటి ప్రకటన విడుదల చేయడం లేదు. దీంతో విద్యార్థుల్లో అమలుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతంతో గతంలో ఇచ్చిన హామీపై ప్రస్తుతం స్పష్టత లేకుండా పోయింది. ఈ ప్రభుత్వ మైనా కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుపై ఇప్పటికి ఎలాంటి నిర్ణయం ప్రకటించ లేదు. అయితే ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యం అందిస్తున్నారు.కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజనం పథకం కూడా ఏర్పాటు చేస్తారే మోనని విద్యార్థులు భావిస్తున్నారు. ప్రభుత్వం పేద విద్యార్థుల ఆకలికేకలు దృష్టిలో పెట్టుకొని పథకం అమలు చేయాలని కోరుతున్నారు.

పౌష్టికాహారం అందడంతో..

ఈ పథకం కళాశాలల్లో అమలు చేస్తే పౌష్టికాహారం అందడంతో విద్యార్థులు చదువుపై దృష్టిసారిస్తారు. భవితకు బాటలు వేసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే విద్యార్థులు ఆకలితో చదువుపై దృష్టి సారించలేని పరిస్థితి నెలకొంది. కుమరం భీం జిల్లా వ్యాప్తంగా 11ప్రభుత్వ కళాశాలలుండగా, ఇందులో జిల్లా వ్యాప్తంగా సుమారు ఐదు వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో ఎక్కువ మంది పేద వర్గాలకే చెందిన వారు ఉన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల భారం భరించే స్తోమత లేక పోవడంతో ప్రభుత్వ కళాశాలల్లో చేరుతున్నారు. జిల్లాలో కొంత మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుతుండగా మరి కొందరు గురుకులాలు, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్నారు.

అమలు చేస్తే బాగుంటుంది..

గోగునూరి రాజేశ్వరి, ఇంటర్ సెకండియర్



ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తే బాగుంటుంది. కళాశాలలకు వెళ్తే పస్తులుండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఆకలితో చదువుపై దృష్టి సారించలేక పోతున్నాం. కళాశాల ల్లో మధ్యాహ్న భోజనం అమలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఈ పథకాన్ని అమలు చేయాలి.

టైగర్‌జోన్ రద్దుకు పోరాడాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ సిర్పూర్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్

కాగజ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టైగర్‌జోన్ రద్దుకు ఐక్యంగా పోరాడాలని సిర్పూరు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. స్థానికంగాఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టైగర్ కన్జర్వేషన్ రద్దు చేయాలని సంబంధిత అధికారులకు వినతి పత్రాలిచ్చామని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు కూడా కేంద్రంతో ఈ విషయాన్ని ప్రత్యేక చొరవ చూయించి రద్దు చేయించేలా చూడాలని ఆయన కోరారు. ఇప్పటికే ఈ ప్రాంతం వెనుకబడి ఉందన్నారు. టైగర్ కన్జర్వేషన్‌తో మరింత వెనుకబడుతుందని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవయ్య, సత్యనారాయణ, బండు, వెంకటేష్ సంతోష్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్యాయం చేస్తే సహించబోం

జైనూర్, జూన్, 8 (ఆంధ్రజ్యోతి): టైగర్‌జోన్ పేరిట ఆదివాసీలకు అన్యాయం చేస్తే సహించబోమని సర్పంచుల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి మేస్రాం రాహుల్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకరుతో మాట్లాడారు. ప్రభుత్వం జీవో 49ను తెరపైకి తెచ్చి ఆదివాసీలను పోడు భుములు సాగు చేయనివ్వకుండా అడ్డుకునే కుట్రలు చేస్తోందన్నారు. టైగర్ జోన్ పేరట ఆదివాసీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీరని అన్యాయం చేస్తున్నాయని చెప్పారు. వెంటను ప్రభుత్వం టైగర్ జోన్ ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు మడావి భీంరావ్, కుంర శాంరావ్, మేస్రాం నాగోరావ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

రెబ్బెన, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. 11 ఏళ్ల పాలనలో రాష్ట్రాల అభివృద్ధికి కృషి చేశారని తెపాఆరు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని రామాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, నాయకులు వెంకన్న, దుర్గం శ్రీధర్, తదితర, కార్యకర్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీలో ప్రధాన కార్యదర్శులుగా మల్లేష్, సతీష్, ఉపాధ్యక్షులుగా వేణుగోపాల్ చారి, పద్మ, కార్యదర్శులుగా రాచకొండ భాగ్యలక్ష్మి, సచిన్ జైశ్వాల్‌ను ఎంపిక చేశామని తెలిపారు.

స్వర్ణపతకం సాధించిన క్రీడాకారిణికి సన్మానం



సుహాసినిని సన్మానిస్తున్న ఆదివాసీ నాయకులు

సిర్పూర్(యు), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పశ్చిమబెంగాల్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో బంగారు పతకం సాధించిన సిర్పూర్ (యూ) మండలానికి చెందిన గేడం సుహాసిని అనే క్రీడాకారి నిని ఆదివారం ఆదివాసీ నాయకులు సన్మానించారు. అంతర్జాతీయ 9వ సౌత్ ఆసియన్ అత్యపత్య చాంపియన్‌షిప్ 2024-25 పోటీలు ఇటీ వల పశ్చిమ బెంగాల్‌లోని హసీమరలో నిర్వహించారు. ఇందులో తెలంగాణ నుంచి సిర్పూర్(యు) మండలం భూర్నూర్(కే) గ్రామానికి చెందిన ఆదివాసీ బిడ్డ గేడం సుహాసిని పాల్గొన్నారు. భారత దేశంతోపాటు నేపాల్, శ్రీలంక తదితర దేశాల క్రిడాకారులు పాల్గొన్నారు. ఈపోటీ ల్లో ప్రతిభ చాటిన సుహాసిని స్వర్ణపతకం సాధించింది. . ప్రస్తుతం ఆమె ఆసిఫాబాద్‌లో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. కార్యక్రమంలో గోండ్వాన గోండ్ మహా సభ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం ఆనంద్‌రావు, జంగో లింగో ఘన్ సంస్థాన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గేడం జగ్జీవన్, కోయపూనేం జిల్లా నాయకుడు ఉర్వెత మోహన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కాగజ్‌నగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ బాలభారతి ఉన్నత పాఠశాలలో 1993-94లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పుడు తమకు పాఠాలు చెప్పిన గురువులను సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు
- బడీడు పిల్లలను నమోదు చేసుకుంటున్న సిబ్బంది

బెజ్జూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు అన్నారు. బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి గ్రామంలో ఆదివారం ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించారు. ప్రతి ఒక్క విద్యార్థి పాఠశాలల్లో చేరాలని ఉపాధ్యాయులు సూచించారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పిల్లల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పనులకు వెళ్లకుండా పాఠశాలలో చేరాల న్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, భుజంగరావు, రమేష్, రాఘవరావు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల పరిధిలో ఆదివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికి తిరుగుతూ ప్రైవేటు పాఠశాల్లో పిల్లను చేర్పించవద్దని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, నాణ్యమైన విద్య అందిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, సాయికిరణ్, అంగన్‌వాడీ టీచర్లు పార్వతి, పద్మ, మమత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఎంఈవో జయరాజు అన్నారు. ఆదివారం మండలంలోని బాబాసాగర్, బారెగూడ(బి), చింతలమానపల్లి, ఇందిరానగర్ తదితర గ్రామల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడి మానేసిన పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని విద్యా ర్థుల తల్లితండ్రులకు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. బడి బయట ఉన్న పిల్లల పేర్లను ఈ సందర్భంగా నమోదు చేశారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పానాపటార్‌లో ఆదివారం ఎస్సీఈఆర్టీ ఉయిక శంకర్ ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామస్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. పిల్లల్ని ప్రతి ఒక్కరూ పాఠశాలకు పంపించాలని సూచించారు. అనంతరం శంకర్ ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



సలుగుపల్లిలో నమోదు చేసుకున్న విద్యార్థులు

జోరుగా చేపల అమ్మకాలు

- మృగశిర తొలి రోజు కొనుగోలు చేసిన ప్రజలు



కౌటాలలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దహెగా/బెజ్జూరు/పెంచికలపేట/కౌటాల/జైనూర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తి తొలిరోజు ఆదివారం చేపల అమ్మకాలు జోరుగా కొనసాగాయి.. ఇటు చేప మందు, అటు ఈ కార్తిలో చేపలు తప్పకుండా తినాలనే ఆనవాయితీ, పైగా ఆదివారం కాటంతో మార్కెట్లు జనాలతో కళకళలాడాయి. దహెగాం మండల కేంద్రంలో ఆదివారం మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలకు డిమాండ్ లభించింది. మండల కేంద్రానికి హత్తిని, బొప్పురం, అయినం, దేవలగూడెం, పార్వతిపేట తదితర గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చి చేపలను కొనుగోలు చేశారు. చేపలు కిలోకు రూ.200 నుంచి రూ.300లు ధర పలికిం ది. బెజ్జూరు మండలంలో చేపల కోసం ప్రజలు పరుగులు తీశారు. గొల్లబాయి చెరువు వద్ద చేపల కోసం ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. పెంచికల మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చేపలకు డిమాండ్ పెరిగింది. మండలంలోని బొక్కివాగు, ఉచ్చమల్ల ప్రాజెక్టుతో పాటు పెద్దవాగు వద్ద చేపల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. మృగశిర కార్తె రోజు చేపలు తినడం అనాధిగా వస్తోంది. దీంతో కిలో చేపలు రూ.200 నుంచి రూ.250 వరకు ధర పలికాయి. కౌటాల మండలంలో చేపలకు భలే గిరాకీ లభించింది. చేపల కోసం ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. చేపల కొనుగోలు చేసేందుకు చెరువుల వద్దకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జైనూర్ మండల కేంద్రంలో చేపల కొనుగోలు కోసం ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. చేపలు కిలోకు 3 వందల రూపాయలకుపైగా విక్రయించారు.

పద్మశాలి యువజన సంఘం మండల కార్యవర్గం

వాంకిడి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో ఆదివారం పద్మశాలి యువజన సంఘం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎంగలి రాకేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సంతోష్, సాయి, ప్రధాన కార్యదర్శిగా సాయి విఘ్నేష్, కార్యదర్శిగా రాకేష్, కోశాధికారిగా అఖిల్, ప్రచార కార్యదర్శిగా సాయిచరణ్, కార్యవర్గ సభ్యులుగా రామకృష్ణ, రాకేష్, చంద్రయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సతీష్, బండు, మొండయ్య, వెంకటేశం, రవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అస్తవ్యస్తం

- అపరిశుభ్రంగా డ్రైనేజీలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



సిర్పూర్(టి)లో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీ

సిర్పూర్(టి), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు బావులు, చేతి పంపుల వద్ద మురుగు నిలువ ఉండడంతో పాటు ముఉగు కాలువల్లో పూడిక నిండి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల స్వైరవిహారం చేస్తున్నాయి. పలువురు ఇప్పటికే అస్వస్థతకు గురవతున్నారు. వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ముందస్తు పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ అధికారులు ఆ దిశగా ప్రణాళికలు రూపొందించడం లేదు. గతేడాది మారు మూల గ్రామాల్లో పారిశుధ్యం లోపించి, డెంగి, విష జ్వరాలతో ప్రజలు ప్రాణాలను కోల్పోయారు. ఈ తరుణంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. గతేడాది వర్షాకాలంలో కౌటాల మండలంలోని గుండాయిపేటలో పారిశుధ్యం లోపించి విషజ్వరాలతో గ్రామానికి చెందిన బోయర్ కాళీదాస్, పూజలు ఒకే రోజు ఇద్దరు మృతి చెందారు. జిల్లా యంత్రాంగం ఇద్దరు ప్రాణా లు కోల్పోయాక గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యం, వైద్య శిబిరాలు నిర్వహించి హడావుడి చేశారు. ముం దస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుని ఉంటే ఈ ఘటన జరిగేది కాదని గ్రామస్థులు చెబుతున్నారు.

15 మండలాల పరిధిలో..

జిల్లాలో 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయ తీలు ఉన్నాయి. పంచాయతీలకు నిధుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడాది కాలంగా నిధులు విడుదల చేయక పోవడంతో అభివృద్ధి కుంటుపడుతుంది. వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం, మురుగు కాలువల్లో పూడిక తీత, విద్యుత్ దీపాల ఏర్పాటు, తాగునీటి పైపులైన్ లీకేజీ అనేక పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది. అయితే పంచాయతీల్లో నిధులు లేక ఏ పనులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో నీరు కలుషి తమయ్యే ప్రమాదం ఉంది. ఫలితంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి నీరు నిలువ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ నీటిలో దోమలార్వా అభివృద్ధి చెందకుండా స్ప్రే చేయాల్సి ఉంది. ప్రభుత్వ బావులు, కాలువలు, చేతి పంపుల వద్ద నీరు నిలువ కావడంతో దోమల వ్యాప్తి పెరిగింది. దీంతో బ్లీచింగ్ పౌడర్ చల్లించాల్సి ఉండగా ఏ పంచాయతీలోనూ చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.